సాక్షి రంగారెడ్డి

శనివారం । 29 । జూన్ । 2024



నిధులు రాక.. వెతలు తీరక

గ్రామ పంచాయతీల ఖాతాల్లో నిధులు లేక పాలన నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. అభివృద్ధి ముందుకు సాగడం లేదు. 10లో▸



ప్రజాసంక్షేమమే ధ్యేయం

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 10లో▸



దోపిడీని అరికట్టండి

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రైవేటు ఆస్పత్రుల బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌గౌడ్ కోరారు. 10లో▸

మాంసపు ముద్దలు నెత్తుటి ధారలు

బూర్గులలోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో భారీ పేలుడు

- విగత జీవులుగా మారిన వలస కార్మికులు
- ఐదుగురి మృత్యువాత.. 13 మందికి తీవ్ర గాయాలు
- మిన్నంటిన హాహాకారాలు
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, డీసీపీ
- ఘటనపై ఆరా.. క్షతగాత్రులకు పరామర్శ



యంత్రంలో ఇరుక్కుపోయిన కార్మికుడి మృతదేహం

షాద్‌నగర్/ షాద్‌నగర్‌రూరల్: బతుకుదెరువు కోసం రాష్ట్రాలు దాటి వచ్చిన వలస కార్మికుల బతుకులు తెల్లారిపోయాయి. షాద్‌నగర్ పరిధిలోని బూర్గుల శివారులోని సౌత్ గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం ఆటో క్లేవ్ యూనిట్ వద్ద సంభవించిన భారీ పేలుడు పెను విషాదం మిగిల్చింది. వలస జీవులను విగత జీవులుగా మార్చింది.

పాపం వలస జీవులు

సౌత్ గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో వాహనాలకు సంబంధించిన అద్దాలను తయారు చేస్తారు. ఆటో క్లేవ్ యూనిట్ వద్ద రెండు అద్దాలను బాయిలర్‌లో వేడి చేసి గ్యాస్ సాయంతో అతికిస్తారు. తయారైన అద్దాలను బాయిలర్ నుంచి బయటకు తీసే క్రమంలో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో 13 మంది క్షతగాత్రులుగా మారారు. వీరిలో ఓ కార్మికుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.



ధ్వంసమైన పైకప్పు

గాయపడిన కార్మికులను షాద్‌నగర్ పట్టణంలోని వీవా ఆస్పత్రికి తరలించారు.

పరిశ్రమలో జరిగిన ప్రమాదానికి ఐదుగురు కార్మికులు బలయ్యారు. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు తెగి పడ్డాయి. మాంసం ముద్దలు పరిశ్రమ బయట సుమారు వంద మీటర్ల దూరంలో ఎగిరి పడ్డాయి.

భీతావహ వాతావరణం..

ప్రమాదం జరిగిన ప్రదేశంలో మృతుల శరీర భాగాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. మృతి చెందిన పలువురి కార్మికుల కాళ్లు, చేతులు, తల భాగాలు పరిశ్రమలో ఎగిరి పడ్డాయి. చెల్లా చెదురుగా పడిన మృతుల శరీర భాగాలతో ఘటనా స్థలంలో భీతావహ వాతావరణం నెలకొంది.

పరిశీలించిన కలెక్టర్

పరిశ్రమలో జరిగిన ఘటనపై వెంటనే స్పందించిన కలెక్టర్ శశాంక పరిశ్రమను సందర్శించారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి కారణాలను అధికారులు, పరిశ్రమ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి షాద్‌నగర్ వీవా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 13 మంది కార్మికులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా నిలుస్తుందని వారికి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. మృతుల కుటుంబీలకు వివరాలను సేకరించి వారికి ప్రమాద ఘటన సమాచారం అందజేయాలని సూచించారు. ఘటనా స్థలాన్ని శంషాబాద్ డీసీపీ రాజేష్, అదనపు డీసీపీ రాంకుమార్, ఏసీపీ రంగస్వామి, ఆర్‌డీఓ వెంకట మాధవ రావు సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు.



పేలుడు ధాటికి పరిశ్రమలో పగిలిపోయిన అద్దాలు

న్యాయం చేయాలి

ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, బక్కని నర్సింలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని, గాయపడిన కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు.

ఒక్కసారిగా పేలుడు..

● ప్రత్యక్ష సాక్షి హేమంత్



పరిశ్రమలో కార్మికులంతా పని చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది.. దీంతో అందరం బయటకు పరుగులు పెట్టాం అని ప్రత్యక్ష సాక్షి, కార్మికుడు హేమంత్ తెలిపాడు. పరిశ్రమలో ఆటో క్లేవ్ యూనిట్ సమీపంలో తాను పని చేస్తున్నానని పేలుడు ఘటనలో తృటిలో తప్పించుకున్నట్లు చెప్పాడు. మృతి చెందిన కొందరి కార్మికుల శరీర భాగాలు చెల్లా చెదురుగా పడ్డాయని, అవి చూసి చాలా భయమేసిందని పేర్కొన్నాడు. ఓ కార్మికుడి శరీరం పరిశ్రమ పై కప్పునకు తాకి పరిశ్రమ బయట పడిందని పరిస్థితిని వివరించాడు.



కంపెనీ ఆవరణలో కార్మికుడి మృతదేహం

కార్మికుల ఉరుకులు పరుగులు

పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో పేలుడు జరిగింది. ఆ సమయంలో పరిశ్రమలో సుమారు 200 మంది కార్మికులు పని చేస్తున్నారు. పేలుడు శబ్దానికి పరిశ్రమలో ఉన్న కార్మికులు ఉరుకులు పరుగులు తీశారు. ఏం జరిగిందో తెలిసేందుకు సుమారు గంట సమయం పట్టింది. ఈ పరిశ్రమలో స్థానికులతో పాటు ఒడిశా, బీహార్, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పని చేస్తున్నారు.



సౌత్ ఇండియా గ్లాస్ పరిశ్రమ ఇదే..



భయాందోళనలో పరిశ్రమ బయట కార్మికులు

న్యూస్‌రీల్

లేఖ్య.. లేదిక

చికిత్స పొందుతూ లా విద్యార్థిని కన్నుమూత

శంకర్‌పల్లి: వేడి నీళ్లు ఒంటిపై పడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ఇక్ఫాయ్ యూనివర్సిటీ ఎల్‌ఎల్‌బీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని లేఖ్య(21) శుక్రవారం మృతిచెందింది. గత నెల 15న సాయంత్రం వేళ స్నానం చేసేందుకు వాష్‌రూమ్‌లోకి వెళ్లిన యువతి.. అతి వేడిగా ఉన్న నీళ్లను గమనించకుండా ఒంటిపై పోసుకోవడంతో 40శాతం చర్మం కాలిపోయిన విషయం తెలిసిందే. వెంటనే ఆమెను అంబులెన్స్‌లో కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓమ్నీ ఆస్పత్రిలో, తర్వాత కంచన్‌బాగ్‌లోని అపోలోలో చేర్పించారు. మొదట యాసిడ్ దాడి జరిగినట్లు కుటుంబ సభ్యులు భావించినా.. ల్యాబ్ పరీక్షల ద్వారా వేడి నీళ్లు పడటంతోనే గాయాలయ్యాయని నిర్ధారించారు. విద్యార్థిని చికిత్స కోసం కాలేజీ యాజమాన్యం సైతం పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేసింది. అయినప్పటికీ లేఖ్య కన్నుమూయడంతో కాలేజీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి స్వస్థలం తిరుపతి కాగా.. మేనమామ సంరక్షణలో ఉంటోంది.

బోనాల ఉత్సవాలకు నిరంతర విద్యుత్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బోనాల సందర్భంగా నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని.. ప్రముఖ ఆలయాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం సీజీఎంలు, ఎస్ఈలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జులై 2 నాటికి సంబంధిత సీఈలు/ఏఈలు ఆలయ ప్రాంగణాలను సందర్శించి 24 గంటల విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ దేవాలయానికి ఒక నోడల్ అధికారి/ఏఈని కేటాయించాలన్నారు. ఆర్అండ్‌బీ, ఆలయ కమిటీలతో సమన్వయం చేసుకోవడంతో పాటు డీటీఆర్‌లు, అదనపు లైట్లు, ఎయిర్ కండిషనింగ్, సౌండ్ సిస్టంకు తగినట్లు విద్యుత్ లోడ్ ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ సామగ్రిని సమకూర్చుకోవాలన్నారు. ప్రజలు గుమిగూడే చోట విద్యుత్ స్తంభాలు షాక్ కొట్టకుండా ముందే చెక్ చేయాలన్నారు. విద్యుత్ లీకేజీలను పూర్తిగా అరికట్టాలన్నారు. అన్ని పంపిణీ కేంద్రాల్లోనూ టంగ్ టెస్టర్ ద్వారా ఎర్తింగ్‌ను చెక్ చేయడంతో పాటు ప్రతి గంటకోసారి రీడింగ్ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు నందకుమార్, డాక్టర్ నర్సింహులు, సీజీఎంలు కె.సాయిబాబా, ఎల్.పాండ్య, వి.శివాజీ, పి.భిక్షపతి, పి.ఆనంద్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజమే లక్ష్యం

ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కొత్తూరు: ఆరోగ్యకరమైన సమాజ స్థాపనే స్టేట్ ఫుడ్ కమిషన్ (రాష్ట్ర ఆహార భద్రత కమిషన్) లక్ష్యమని కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ, రేషన్‌దుకాణం, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ ఆస్పత్రిలో అందుతున్న సేవలను శుక్రవారం ఆయనతో పాటు కమిషన్ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం పలు పథకాల ద్వారా గర్భిణులు, బాలింతలు, విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం పంపిణీ చేస్తోందని తెలిపారు. ఈ పంపిణీలో ఆయా శాఖల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పంపిణీ, సేవల్లో లోపాలుంటే చర్యలు తీసుకునే అధికారం కమిషన్‌కు ఉందన్నారు. అనంతరం జిల్లా సమీకృత భవనాల సముదాయాల్లోని కార్యాలయంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డితో చైర్మన్ సమావేశమయ్యారు.

తనిఖీల్లో కనిపించిన లోపాలు..


కమిషన్ సభ్యులు ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న సేవల రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. రికార్డుల్లో నమోదు చేసిన పలువురు విద్యార్థుల బరువును వాస్తవంగా ఉన్న బరువును సరి చూశారు. కొందరు గర్భిణుల అటెండెన్స్‌ను ముందస్తుగా తీసుకోవడాన్ని గుర్తించారు. ప్రభుత్వ పాఠశాలలో కులాల వారీగా విద్యార్థుల అటెండెన్స్ తీసుకోవడంపై కమిషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే హెచ్‌ఎంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, అంగన్‌వాడీ, ఆశాల వద్ద వివరాలు సక్రమంగా లేవని గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులకు కనపడేలా నోటీసు బోర్డులు పెట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెనూ వివరాలను బయట గోడలకు అంటించాలని హెచ్‌ఎంకు సూచించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు ఆనంద్, గోవర్ధన్ రెడ్డి, శారద, భారతి, జ్యోతి, డీఆర్‌ఓ సంగీత, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, డీఈఓ సుశీందర్‌రావు, డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు, మహిళా శిశు సంక్షేమ అధికారి పద్మజారమణ, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కిరణ్, ఆర్డీఓ వెంకటమాధవరావు, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం వడ్డిస్తూ నాణ్యతను పరిశీలిస్తున్న సభ్యులు

'మహా'ఆలోచన

ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి



యాచారం: ఓఆర్ఆర్ పక్కనే కాలుష్య రహిత మహా నగరాన్ని నిర్మించేందుకు సీఎం రేవంత్ దృష్టి సారించారని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గంలోని 19,333 ఎకరాల్లో మాజీ సీఎం కేసీఆర్ నిర్మించ తలపెట్టిన ఫార్మా సిటీని ప్రస్తుత సీఎం రేవంత్ ముందస్తు ఆలోచనలతో రద్దు చేశారని తెలిపారు.

అన్నీ ఒకేచోట

ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో మహానగర స్థాపనే లక్ష్యంగా విద్య, వైద్యం, శాస్త్ర, సాంకేతిక, ఐటీ రంగాలు ఒకే చోట ఉండేలా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ముదిరెడ్డి వెల్లడించారు. ఈ నగరానికి మెట్రో రైలు మార్గం ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. నగరం ఏర్పాటుకు సీఎం రేవంత్ మేధావులు, శాస్త్రవేత్తలు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులతో సమాలోచనలు చేస్తున్నారని, దీంతో ఈ ప్రాంత వ్యవసాయ భూములు, ప్రజలకు ఎలాంటి హానీ జరగదన్నారు. ఫార్మాసిటీకి భూము లిచ్చిన రైతులకు అన్యాయం జరగనీయమన్నారు.

స్థానికులకు ఉద్యోగ అవకాశాలు

ఫార్మాకు సేకరించిన భూముల్లో మళ్లీ పరిశ్రమలు వస్తున్నాయని, కాలుష్య పరిశ్రమలతో ప్రజలకు ముప్పు తప్పదని కొందరు విష ప్రచారం చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని కోదండరెడ్డి సూచించారు. రైతులు ఆందోళన చెందవద్దని, సర్కార్‌కు సహకరిస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి అవుతుందని, తద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్‌కు షాక్



- సొంత గూటికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- అంతర్మథనంలో బీఆర్ఎస్ శ్రేణులు
- కలవరంలో కాంగ్రెస్ నాయకులు
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశం

నియోజకవర్గ అభివృద్ధికోసమే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. అందరినీ కలుపుకొని సమన్వయంతో కాంగ్రెస్ పార్టీలో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. ప్రజలకు

నియోజకవర్గ అభివృద్ధికోసమే..

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం సాయంతో నెరవేరుస్తానని చెప్పారు. మూడుసార్లు నియోజకవర్గ ప్రజలు అవకాశం కల్పించారని.. వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

చేవెళ్ల/మొయినాబాద్: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలువురు ఎమ్మెల్యేలు పార్టీ మారతారనే సంకేతాలు వచ్చినప్పుడల్లా కాలె యాదయ్య పేరుకూడా ప్రధానంగా వినిపిస్తూ వచ్చింది. ఆయన మాత్రం ఎప్పటికప్పుడు దీనిని కొట్టిపారేస్తూ వచ్చారు. చివరికి పార్టీ మారతారనే ప్రచారాన్ని నిజం చేశారు.

కాంగ్రెస్‌పార్టీతోనే రాజకీయ జీవితం

కాలె యాదయ్య రాజకీయ జీవితం అధిక భాగం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగింది. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాతే ఆయన బీఆర్ఎస్‌లోకి మారారు. ఇప్పుడు బీఆర్ఎస్‌లో గెలిచి సొంత గూటికి చేరుకున్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం చించల్‌పేటకు చెందిన యాదయ్య 1980లో రాజకీయరంగ ప్రవేశం చేశారు. మొదట డీసీఎంఎస్ డైరెక్టర్‌గా, తరువాత సింగిల్ విండో చైర్మన్‌గా, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా పని చేశారు. 1995లో నవాబుపేట జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. 2001 నుంచి 2006 వరకు నవాబుపేట ఎంపీపీగా పనిచేశారు. 2009లో చేవెళ్ల నియోజకవర్గంలోకి నవాబుపేట మండలం కలవడం.. ఎస్సీగా రిజర్వుకావడంతో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్నారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కేఎస్ రత్నం చేతిలో 2,249 ఓట్లతో ఓటమి పాలయ్యారు. 2014లో మళ్లీ పోటీ చేసి అప్పటి టీఆర్ఎస్‌పార్టీ నుంచి పోటీ చేసిన కేఎస్ రత్నంపై 781ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఏడాదిలోనే అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి 33,552 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి కేఎస్ రత్నంపై గెలుపొందారు. 2023లో జరిగిన ఎన్నికల్లో రెండోసారి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి 268 ఓట్ల స్వల్ప మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్‌పై గెలుపొందారు.

సోషల్ మీడియాలో వైరల్

ఎమ్మెల్యే యాదయ్య కాంగ్రెస్‌లో చేరిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికంగా చర్చలు మొదలయ్యాయి. ఇరు పార్టీల నేతలు తమదైన శైలిలో స్పందించారు. కొందరు పార్టీ మారడాన్ని సమర్థిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడితే మరికొందరు వ్యతిరేకిస్తూ పోస్టులు పెట్టారు. ఎమ్మెల్యే యాదయ్య గతంలో పార్టీ మారబోనని చెప్పిన వీడియోలను ట్రోల్ చేశారు.

సంశయంలో బీఆర్ఎస్ నాయకులు

నిన్నటి వరకు తమకు రాష్ట్రంలో అధికారం లేకపోయినా స్థానికంగా ఎమ్మెల్యే ఉన్నాడని భావించిన బీఆర్ఎస్ శ్రేణులు ఆయన పార్టీ మారడంతో అంతర్మథనంలో పడ్డారు. కొందరు ఆయనతో వెళ్లాలా.. వద్దా అన్న సంశయంలో ఉండగా మరి కొంతమంది ఆయనతోనే వెళ్తామని బాహాటంగానే చెబుతున్నారు. యాదయ్య గెలుపుకోసం పార్టీలో కష్టపడి పనిచేసిన కొందరు కార్యకర్తలు ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

మరోవైపు కాలె యాదయ్య చేరికతో కాంగ్రెస్ నాయకులు కలవరపడుతున్నారు. నామినేటెడ్ పదవులు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే తన మనుషులకే సముచిత స్థానం ఇచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. మరోవైపు యాదయ్యపై స్వల్ప మెజార్టీతో ఓటమిపాలైన కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ ఆయనతో కలిసి పనిచేస్తారా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కార్యకర్తలంతా భీమన్నా.. మేమంతా నీ వెంటే అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండడం గమనార్హం.

దెబ్బమీద దెబ్బ

అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీని వీడారు. కాంగ్రెస్‌లో చేరి కల్వకుర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. అంతకు ముందే ఇబ్రహీంపట్నం సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ దంపతులు పారిజాత నర్సింహారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పార్టీని వీడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా ఓటమిని చవిచూసినా.. రంగారెడ్డిలో మాత్రం హవా కొనసాగించింది. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల, ఎల్బీనగర్, మహేశ్వరంలో బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సహా మరి కొంత మంది సీనియర్ నేతలు పార్టీని వీడారు. చివరికి చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా పార్టీ మారారు.

క్లుప్తంగా

దాడికి పాల్పడటం హేయమైన చర్య

షాద్‌నగర్: రవాణాశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారి పై దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని దుర్గామాత డ్రైవింగ్ స్కూల్ యూనియన్ అధ్యక్షుడు రాచూరి విజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఎంవీఐ వాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్ ఖైతరాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు అనుమల ఖాన్ ప్రభుత్వ అధికారి పై దాడి చేయడాన్ని ఖండించారు. దాడికి పాల్పడటం హేయమైన చర్య అని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు.

బ్రీత్ అనలైజర్‌తో ఉడాయించిన మందుబాబు

కంటోన్మెంట్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మందుబాబులను హడలెత్తించే పోలీసులకే చుక్కలు చూపించాడో మందుబాబు. బోయిన్‌పల్లిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఎదురైందీ ఘటన. వివరాలు ఇలా ఉన్నాయి. బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం రాత్రి పుల్లారెడ్డి బంగళా సమీపంలో డ్రంక్ అండ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ క్యాబ్ డ్రైవర్‌ను పరీక్షించేందుకు, బ్రీత్ అనలైజర్‌ను అతడికి సమీపంగా తీసుకెళ్లగా.. డ్రైవర్ బ్రీత్ అనలైజర్‌తో పాటు తన కారును వేగంగా ముందుకు తీసుకెళ్లి పరారయ్యాడు. వెంబడించినా ఫలితం లేదు. కేసు దర్యాప్తులో ఉంది.

నిధులు రాక.. వెతలు తీరక

- పారిశుద్ధ్య కార్మికులకు అందని వేతనాలు
- పంచాయతీ కార్యదర్శులకు తప్పని తిప్పలు
- భారంగా గ్రామ పంచాయతీ పాలన

షాబాద్: గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని మహాత్ముడు ఆనాడే సెలవిచ్చారు. దేశాభివృద్ధిలో పల్లెల పాత్ర అత్యంత ముఖ్యమైంది. అలాంటి గ్రామాల ఖజానా ఖాళీ అవ్వడంతో పాలన నిర్వహణకు అంధకారం అలుముకుంది. గ్రామ పంచాయతీల ఖాతాల్లో నిధులు లేక అభివృద్ధి ముందుకు సాగడం లేదు. పల్లెలకు కేంద్ర, రాష్ట్రాల నుంచి నిధులు రాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా పనులు దర్శనమిస్తున్నాయి. నిధుల లేమితో పంచాయతీ కార్మికులకు వేతనాలు అందించని దుస్థితిలో పల్లెలు కొట్టుమిట్టాడుతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనలో నిధులు రాకపోవడంతో గ్రామ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పాలన పడక

జిల్లా వ్యాప్తంగా 21 మండలాలుండగా, వాటి పరిధిలో 558 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో 3 వేల పైచిలుకు జనాభా గల పెద్దపంచాయతీలు 85 ఉండగా, 473 చిన్న గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా పంచాయతీలకు గతంలో మూడు నెలలకు ఒకసారి స్టేట్ ఫైనాన్స్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించేది. 15వ ఆర్థిక సంఘం నుంచి కేంద్రం నిధులు ఇచ్చేది. ప్రతీ నెల 2011 జనాభా ప్రాతిపదికన రూ.6.70 కోట్లను గ్రామ పంచాయతీలకు నిధులు వచ్చేవి. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడంతో నిధులు విడుదల కావడం లేదు. దీంతో ప్రత్యేకాధికారుల పాలనలో కార్యదర్శులకు అవస్థలు తప్పడం లేదు. గ్రామాల్లో



సర్దార్‌నగర్ గ్రామ పంచాయతీ భవనం

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను కేటాయించింది. వీటి నిర్వహణ కూడా ప్రస్తుతం ఇబ్బందిగా మారింది. డీజిల్ లేకపోవడం, మరమ్మతులు చేయించలేకపోవడం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. పలు గ్రామాల్లో డీజిల్ తేవడానికి ఆర్థిక ఇబ్బందులతో రెండు, మూడు రోజులకు ఒకసారి ట్రాక్టర్‌ల ద్వారా చెత్తను తొలగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 3,581 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వారికి సైతం వేతనాలు సకాలంలో అందడం లేదు. ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించి, పాలక వర్గాన్ని ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తే పంచాయతీలు అభివృద్ధిలో ముందుకు సాగే అవకాశం ఉంది.

వేతనాలు ఇవ్వాలి



ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను నెలనెలా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబపోషణ భారంగా మారుతోంది. ప్రభుత్వం స్పందించి వేతనాలు వచ్చేలా చూడాలి. అలాగే క్రమబద్ధీకరణ చేయాలి.

– నర్సింహులు, పారిశుద్ధ్య కార్మికుడు, తాళ్లపల్లి

నిధులు రావడం లేదు



గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ట్రాక్టర్ రిపేర్‌లు, డీజిల్‌తో పాటు చిన్నపాటి బోరు మోటార్ల మరమ్మతులకు అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం జీపీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.

– ఆశ్రిత, గ్రామ కార్యదర్శి, నరెడ్లగూడ, షాబాద్

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- రూ.15లక్షలతో సీసీరోడ్డు పనులకు భూమిపూజ

కడ్తాల్: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి మైసిగండి ఆలయం పరిసరాలలో రూ.15 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేసి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన కొనసాగుతుందని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. అనంతరం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి,ఆయన సతీమణి మాధవి దర్శించుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు దంపతులను ఘనంగా సన్మానించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ సుజాత, పీఆర్ఏఈ పరమేశ్, ఎంపీఓ తేజ్‌సింగ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, నరేశ్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్‌లు తులసీరాం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య, జవహర్,రాంచందర్ నాయక్, శ్రీనునాయక్, సత్యం,బిక్కునాయక్, పాండునాయక్, శంకర్, గోపి తదితరులు ఉన్నారు.


సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

భర్త వేధింపులు తాళలేక..

గృహిణి బలవన్మరణం

శంకర్‌పల్లి: భర్త వేధింపులు తాళలేక భార్య బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి రంగారెడ్డి జిల్లా కొండకల్ గ్రామంలో చోటుచేసుకుంది. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శేఖర్(35), లక్ష్మి(28) దంపతులు. వీరికి 2015లో వివాహం కాగా.. కూతురు(8), కుమారుడు(6) ఉన్నారు. వీరిద్దరూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. మూడేళ్లుగా శేఖర్ మద్యానికి బానిసై డబ్బులు కావాలని లక్ష్మిని ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా.. మరో వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకున్నావంటూ వేధించేవాడు. దీంతో మనస్తాపం చెందిన గృహిణి అందరూ నిద్రించిన తర్వాత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడి శేఖర్‌ని అరెస్టు చేసి, చేవెళ్ల కోర్టులో హాజరుపరిచారు. అనంతరం సంగారెడ్డి జిల్లా కందిలోని జిల్లా జైలుకి పంపారు. దీంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు.

వివాహేతర సంబంధం దాచడానికే

విచారణ చేపట్టిన పోలీసులకు కొత్త విషయాలు వెలుగు చూశాయి. శేఖర్ కొంత కాలంగా మరో మహిళతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడని, ఆ విషయాన్ని భార్య లక్ష్మి ఎక్కడ నిలదీస్తుందోనన్న భయంతో.. తానే వేధింపులకు గురి చేసినట్లు అనుమానిస్తున్నారు.

అధిక లాభాల పేరిట కుచ్చుటోపి

ఎక్స్‌సీఎస్‌పీఎల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: అధిక లాభాలు ఆశ చూపించి అమాయకులను మోసం చేసిన ఎక్స్‌ఐటీఓ కన్సల్టెన్సీ సర్వీసెస్(ఎక్స్‌సీఎస్‌పీఎల్) సంస్థ ఫైనాన్షియల్ అడ్వైజర్ కడప జిల్లాకు చెందిన గాదిరాజు గురు ప్రసాద్ రాజును సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఈ ఏడాది ఫిబ్రవరిలో డైరెక్టర్ బీఎస్ సతీష్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరుకు చెందిన సతీష్, అవలకొండప్ప వెంకట చలపతి 2015లో బెంగళూరులో ఎక్స్‌సీఎస్‌పీఎల్ పేరుతో కంపెనీ ప్రారంభించారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు చెందిన గాదిరాజు రాజేంద్రప్రసాద్ రాజు, గాదిరాజు గురుప్రసాద్‌రాజు, పాసం వెంకట్ ప్రసాద్, బైరెడ్డి జ్యోతితో కలిసి హైదరాబాద్‌లో కేపీహెచ్‌బీలోని మంజీరా ట్రినిటీ భవనంలో 11వ అంతస్తులో బ్రాంచ్ ఆఫీసును ఏర్పాటు చేశారు. అధిక లాభాలు ఆశించి డిపాజిట్లు సేకరించడమే ఈ కంపెనీ ఉద్దేశంగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎక్స్‌సీఎస్‌పీఎల్.కామ్ వెబ్‌సైట్‌ను సృష్టించారు. పెట్టిన పెట్టుబడులకు సమానమైన 'ఎక్స్' నాణేలతో పాటు 3 నెలలు లాకిన్ పీరియడ్‌తో 3 నెలల్లో 1:1, ఏడాదిలో 1:4 రాబడులు అందిస్తామని అమాయకులను నమ్మించారు.

150–200 బాధితులు..

ఈక్రమంలో సైబరాబాద్‌కు చెందిన టీ.రాజేంద్ర ప్రసాద్‌తో సహా 150–200 మంది నుంచి రూ.2 కోట్లు పెట్టుబడులు పెట్టారు. మూడు నెలల తర్వాత ఇన్వెస్టర్లు డబ్బులు విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించగా.. యాప్ పనిచేయలేదు. ఈ విషయమై కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినా వారు స్పందించకపోగా రాత్రికి రాత్రే కంపెనీని మూసివేశారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన రాజేంద్ర ప్రసాద్, పలువురు బాధితులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు నిందితుడు గురుప్రసాద్‌రాజు నోయిడాలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి ఈ నెల 26న రాజును అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై శనివారం నగరానికి తీసుకొచ్చి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

త్వరలో హైదరాబాద్-విజయవాడ 6 లేన్ల రోడ్డు పనులు

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్-విజయవాడ ఆరు లేన్ల రహదారి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. పీవీ ఘాట్ వద్ద శుక్రవారం నివాళులర్పించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల నుంచి తాను చేసిన పోరాటం కారణంగా నేడు ఈ పనులకు మోక్షం కలుగుతుందని చెప్పారు. సెప్టెంబర్ నెల వరకు భూసేకరణ, టెండర్లు తదితర పనులన్నీ పూర్తి చేసుకొని పనులు మొదలవుతాయని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి గడ్కరి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. రెండు సంవత్సరాల్లో ఈ పనులు పూర్తవుతాయని, అప్పుడు హైదరాబాద్ నుంచి విజయవాడకు రెండు గంటల్లో చేరుకోవచ్చని ఆయన వివరించారు. ఘట్‌కేసర్–ఉప్పల్ పనులు 2018లో మొదలయ్యాయని, ఇన్నేళ్ల కాలంలో ఈ పనుల గురించి కేటీఆర్ అసలు పట్టించుకోనేలేదన్నారు. యాదగిరిగుట్ట, స్వర్ణగిరి దేవాలయంతో పాటు తెలంగాణాలో ఎంతో ముఖ్యమైన వరంగల్ నగరానికి ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని తెలిపారు. ఇలాంటి రోడ్డు పనులు ఆగిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడ్డాయని, ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరితో కూడా ఈ పనుల గురించి చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. గత కాంట్రాక్టర్‌తోనే ఈ పనులు పూర్తి చేయించాలని ప్రయత్నించినా అవి ఫలించలేదని, కొత్త టెండర్లు పిలిచి మళ్లీ పనులు ప్రారంభించేందుకు కేంద్ర మంత్రి ఒప్పుకున్నారని చెప్పారు. రెండు, మూడు నెలల్లో ఈ పనులు ప్రారంభమై ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని తెలిపారు.

ప్రేమ పేరుతో వల.. బాలికపై లైంగిక దాడి

- ఇన్‌స్టాలో పరిచయమైన బాలిక
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

హిమాయత్‌నగర్: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ బాలికకు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో సుల్తాన్‌బజార్ ఏసీపీ కె.శంకర్, ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, అడ్మిన్ ఎస్సై జి.నరేష్ కుమార్‌తో కలిసి కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఆగాపురాకు చెందిన షేక్ అర్బాస్(23) బైక్ మెకానిక్. ఇన్‌స్టాగామ్‌లో 13 ఏళ్ల మైనర్ బాలికను పరిచయం చేసుకున్నాడు. ప్రతిరోజూ చాటింగ్ చేస్తూ ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పాడు. ఈ నెల 24న పాఠశాలకు వచ్చిన బాలికను తనతో పాటు గుల్బర్గాకు తీసుకెళ్లాడు. దీంతో బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు అఘాపురాకు చెందిన షేక్ అర్బాస్ బాలికను తీసుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేశారన్న విషయం తెలుసుకున్న నిందితుడు భయంతో బాలికను తన కుటుంబ సభ్యులకు అప్పగించి పరారయ్యాడు. బాలికను భరోసా సెంటర్‌కు తరలించి, వాగ్మూలం రికార్డ్ చేసిన పోలీసులు నిందితుడు రెండు రోజుల పాటు బాలికతో లాడ్జీలో ఉండి లైంగిక దాడికి పాల్పడ్డాడని గుర్తించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు, శుక్రవారం నాంపల్లి రైల్వేస్టేషన్‌లో షేక్ అర్బాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ శంకర్ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శంకర్

అల్లుకున్న నిర్లక్ష్యం


నక్కర్తమేడిపల్లి చెరువు కట్టపై విద్యుత్ స్తంభాన్ని చుట్టేసిన చెట్ల తీగలు

యాచారం: ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం వలన విద్యుత్ స్తంభాలకు తీగజాతి చెట్టు తీగలు చుట్టూ అలుకుపోయాయి. అసలే వర్షాకాలం.. ఆపై ఇలా చెట్ల కొమ్మలు, తీగలు స్తంభాలు, విద్యుత్ వైర్లను చుట్టేస్తే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆన్‌ఆఫ్‌లు లేకపోవడంతో వీధి లైట్లు పగలు మొత్తం వెలుగుతూనే ఉన్నాయని తెలిపారు. దీని వలన విద్యు వృథాతోపాటు, పోల్స్‌కు తీగలు అల్లుకోవడం వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అధికారులు స్పందించి అల్లుకున్న చెట్ల తీగలు, కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

15 తులాల బంగారం, నగదు దోచుకెళ్లిన దుండగులు

మొయినాబాద్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి బంగారు నగలు, నగదు చోరీ చేశారు. ఈ సంఘటన మొయినాబాద్ మండల కేంద్రంలోని ముస్తఫా హిల్స్ కాలనీలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ ముస్తఫా హిల్స్ కాలనీలో ఉండే ఆసియా సుల్తాన ఇటీవల తన ఇంటికి తాళం వేసి ముంబాయికి వెళ్లింది. కాగా గురువారం రాత్రి సుల్తాన ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని పక్కింటి మహిళ గమనించి, ఆమెకు ఫోన్ చేసి చెప్పింది. ఆమె వెంటనే బండ్లగూడలో ఉండే తన బంధువు అబ్దుల్ ఖుద్దీస్‌కు ఫోన్‌లో విషయం చెప్పింది. రాత్రి 10.30 గంటలకు అబ్దుల్.. సుల్తాన ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటాన్ని గమనించాడు. అందులోని వస్తువులన్నీ చిందర వందరగా పడున్నాయి. బీరువాలోని 15 తులాల బంగారం, కొంత నగదు కనిపించలేదు. సుల్తాన విజ్ఞప్తి మేరకు అబ్దుల్.. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టండి


విజయభారతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జగన్‌గౌడ్

ఆమనగల్లు: తెలంగాణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని రాష్ట్ర ప్రైవేటు ఆస్పత్రుల బాధితుల సంఘం అధ్యక్షుడు, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు జగన్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతిని ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు. ప్రైవేటు హాస్పిటల్స్‌లో ఫీజుల దోపిడీని అరికట్టి, పేదలకు న్యాయం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు అడ్వకేట్ వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.